# స్వేచ్ఛ - స్వతంత్రం

ఏభయ్యారేళ్ళు నిండాయి. ఆ పైన మరో అయిదునెలలు కూడా నిండాయి. మరొక సంవత్సరం ఏడుమాసాల్లో గవర్నమెంటు ఉద్యోగం నుంచి రిటయిరయిపోతున్నాడు చిదంబరం.

అతని కోరిక తీరలేదు.

తాత - అనిపించుకున్నాడు, ఒక సారికాదు, రెండుసార్లు అతని కోరిక తీరే మార్గాలన్నీ మూసుకుపోయాయి.

ఇన్నాళ్ళూ ఒక ఆశవుండేది. ఇప్పుడదీలేదు.

విద్యార్థి దశనుంచీ - కాదు - బాగా ఊహ తెలిసినప్పణ్ణించీ ఆ కోరిక వుంది. అప్పుడెంత ఆశాభావంతో ఉండేవాడు. చదువు పూర్తయితే ఉద్యోగం వస్తుంది. అప్పుడు తనని అడిగేవాడుండడు. ఎలా కావాలంటే అలా ఉండొచ్చు. ఏం చెయ్యాలంటే అది చెయ్యొచ్చు. తనెవరికీ భయపడనవసరం లేదు. అనుకున్నాడు.

భయం బతుకు పరమ ఛండాలం.

స్వేచ్ఛలేని బతుకు పరమ నికృష్టం

ఆఖరికి క్షవరం కూడా తనిష్టంలో లేదు. తన క్షవరం అయ్యాక మంగలిని పిలిచి కొడుక్కు ఎలా చెయ్యాలో తండ్రి చెబుతాడు. తండ్రి డబ్బులిచ్చేవాడు. తండ్రి ఆజ్ఞప్రకారం చిదంబరానికి క్షవరం జరిగేది.

ఆ రోజుల్లో షమ్మీకపూర్‌లాగ, దేవానంద్‌లాగ దువ్వుకోవాలని ఎంతకోరికగా వుండేదో. తలమొత్తం మీద ఎక్కడకొలిచినా జుత్తు ఒకే కొలతలో వుంటే - ఇంకెలాగ? తనకి కావల్సిన రకంగా జుత్తు పెంచుకొని క్రాపు దువ్వుకునే స్వేచ్ఛకూడా లేదు. పోనీ - ఏడవడానిక్కూడా లేదు.

ఆ మాత్రానికి దేనికి ఏడుపు? - అని తండ్రికేకలు.

ఛిఛీ - ఎంత అధ్వాన్నపు బ్రతుకు.

బట్టలు సరేసరి. ఏవి ఎలా కుట్టిస్తే, అలా తొడుక్కోవాలి. కాళ్ళకి జోడూ అంతే. అందరూ ఎంతచక్కని బట్టలు వేసుకుంటున్నారు? ఎంత షోకయిన బట్టలు తొడుక్కుంటున్నారు? తన

ఈడువాళ్ళు ఎంత టిప్‌టాప్‌గా నీట్‌గా హుషారుగా వుంటున్నారు?

హైస్కూల్లో చదువుకునేటప్పుడు కాలేజీకి వెళ్తే పరిస్థితి మారుతుందనుకున్నాడు. పెద్దవాడవుతాడు గనుక, పైగా కలేజీ చదువుకనుక, కొంచెం అయినా తనమాట చెల్లుతుందనుకున్నాడు.

చక్కగా టిఫిన్ చెయ్యాలని వుండేది. కాని ఏదీ దారి? చల్దన్నం తినాలి. ఊరుబిండో, మాగాయో ఏదో వుంటుంది. ఒకోసారి ఏదీ వుండదు. చింతపండూ బెల్లం ముక్కా పిసికి పచ్చడిలా తయారు చేసి, అదే నంజుకొని తినాలి. చిదంబరానికి హోటేల్లో ఫాను కిందకూచుని సాంబారిడ్లీ రెండు స్పూనుల్తో తినాలని వుంటుంది. రవ్వదోసె, కొబ్బరిచట్నీతో తినాల్నుంటుంది. ఉప్మా వేసుకుని, ఉల్లి పెసరట్టు తినాల్ని చాలా కోరిగ్గా వుంటుంది. టిఫిన్‌కాని, భోజనం కాని చేశాక వక్కపొడి వేసుకోవాలనుంటుంది. ఒకోసారి మిఠాయికిళ్లీ వేసుకుని పెదవులు ఎఱ్రగా పండించుకోవాలని కూడా వుంటుంది.

క్రమంగా పెద్దవాడవుతున్నకొద్దీ - స్వేచ్ఛ సాధించాలనుకున్నాడు. చదువుకంటె ఆ ఆలోచనే ఎక్కువగా వుండేది.

సాయంత్రం కాలేజీ వదిలేక తిన్నగా యింటికి రావాల్సిందే. గ్రౌండులో ఆడుకోకూడదు. ఫ్రెండ్స్‌తో పార్కులో కూచుని హాయిగా కాలక్షేపం చెయ్యకూడదు. ఏ చందమామో, చిత్రగుప్తో, యువపత్రికో, ప్రజామతో చదువుకోకూడదు. టెక్స్టు పుస్తకాలే చదవాలి. బద్ధకంగా ఎంతసేపు కావాలంటే అంతసేపు పడుకోకూడదు.

కాలేజీ చదువు పూర్తయి ఉద్యోగం వస్తే - అన్నీ సాధించాలనుకున్నాడు. పెళ్లికూడా స్వతంత్రంగా తనకు ఇష్టమైన రకంగా చేసుకోవచ్చుననుకున్నాడు. కులాంతర, మతాంతర వివాహం చేసుకుని సినీమాహీరోలా, హిరోయిన్‌గా ఉండాలనుకొన్నాడు.

హైస్కూలు దాటి కాలేజీకొచ్చాక, పరిస్థితి మరింత అధ్వాన్నమయిపోయింది. తమ్ముళ్ళూ, చెల్లెళ్లూ, పెరిగారు. వాళ్ళూ చదువుకొచ్చారు. మరి అందర్నీ చదివించాలంటే, వాళ్ళక్కూడా తిండీ బట్టా ఇవ్వాలంటే తండ్రికి సంపాదన చాలదు. ఏడుగురు బిడ్డల్ని కని తల్లి రోగిష్టిదయిపోయింది. మందులు, మాకులు. అవీ పూర్తిగాలేవు. ఏవో తెలిసిన మందులు వేసుకోవడమే. మిరియాల కషాయం, కరక్కాయ, శొంఠికొమ్ము, చంద్రకాంత ఆకు, మంచిగంధం పట్టు... ఇలా వుండేది వైద్యం. పెద్ద సంసారం. వచ్చీ, పోయే చుట్టాలు. ఈదడం కష్టమే జ్ఞానం వస్తున్నకొద్దీ తండ్రిమీద కోపం పోయి, జాలి వేసేది.

***

ముందుగదిలో కూచుని తండ్రి పేపరు చదువుకొంటున్నాడు. ఆయనకిప్పుడు ఎనభయి ఏళ్ళు. మనిషి బాగా లొంగిపోయేడు. కాని ఆ కోపం పోలేదు. అజమాయిషీ చెలాయించే తత్త్వం పోలేదు. ఇప్పటికీ చిదంబరం ఇంటికి రావడం వేళబాగా మించిపోతే - గద్దించినట్టు అడుగుతాడు తండ్రి.

ప్రేమా? వాత్సల్యమా? జాగ్రత్తా? వట్టిది. కేవలం అధికారం చెలాయించే తత్త్వమే. ఒకటికి

రెండుసార్లు గట్టిగానే చెప్పాడు అలా అడగొద్దని. తండ్రి అంతకంటే సర్రుమన్నాడు - "అడక్కూడదా? బాధ్యత నెత్తిమీదికి వచ్చినవాడివి. కాస్త పెందలాడే ఇంటికి రాకూడదూ-" అన్నాడు. అవిమాటలు కావు. కేకలే ఆ మాట తీరే అంత.

మూడేళ్ళ మనుమరాలు బెదిరింది పెద్దాయనకేకలకి. సిగ్గుసిగ్గు సిగ్గనిపించింది. నోరు మూసుకుని వూరుకున్నాడు చిదంబరం.

"ఎందుకు మూతాత అలా కేకలేస్తున్నారూ?" అంది తన మనవరాలు. ఏం చెబుతాడూ? ఏదో సర్ది చెప్పాడు.

"తాతయ్యా, నీకు మూతాతంటే భయమా?" అని తిరగేసి అడిగింది. దానికీ తెలిసిపోయింది. భయం బ్రతుకు. స్వేచ్ఛలేని బ్రతుకు. ఒక పక్క భార్యా అంతే, ఏదేదో సణుగుతుంది. ఒకోసారి కేకలేస్తాడు. ఒకోసారి సర్దిచెప్పి ఊరుకోబెడతాడు.

ఒకసారి ఆఫీసు నుంచి - కొత్తమ్మాయి, కొత్తగా వచ్చిన క్లర్కు, వచ్చింది. అందంగా వుంటుంది. హాయిగా ఆమెతో నవ్వుతూ మాట్లాడ్డానికి లేదు. ప్రావిడెంట్ ఫండ్‌లోన్, ఇంక్రిమెంట్, ఎర్నెడ్ లీవు, డి.ఎ.ఎరియర్స్, ఫెస్టివల్ ఎడ్వాన్స్ ఏదో చెప్పుకుందికి వస్తారు. ఆ అమ్మాయి ఫెస్టివల్ ఎడ్వాన్స్ కోసం వచ్చింది. ఆ తరువాత ఏవేవో కుటుంబ ఇబ్బందులు చెప్పింది. బొత్తిగా మూతి ముడుచుకోలేడు గద. వాక్యం చెరిసగం తెంపలేడు గద. తానూ ఏదో అంటాడు.

"ఎందుకాసోది గంటల తరబడి? ఆఫీసరు లక్షణాలేనా అవీ? ముక్తసరిగా మాట్లాడి పంపొచ్చుకదా? అందుకే మిమ్మల్ని లోకువ కడుతున్నారని" గొడవచేస్తుంది భార్య.

ఇదేమిటీ బాధ. అన్నిటికీ నీ గొడవేమిటి? గద్దింపేమిటి? - అంటాడు.

తగువు పెరుగుతుందని భయం. భార్యనోట్లో నోరు పెట్టాలంటే జంకు.

తగ్గిపోతాడు. భయం భయం బ్రతుకు.

తండ్రి తన తల్లిని ఎలా గద్దించేవాడు. ఇప్పటికీ - డెబ్బయిమూడేళ్ళ మనిషిని మునిమనమల్ని ఎత్తిన మనిషిని - ఎంతలేసి మాటలంటాడు? తల్లి పాపం అణిగిమణిగి సణుగుతూ, మూలుగుతూ, నోరు మూసుకుని బ్రతుకుతుంది. భయం భయంగా బ్రతకుతుంది. తనకి తల్లి పోలికలే. తనది భయం బ్రతుకే -

ఏభయి ఆరేళ్ళు నిండాయి. పైన మరొక ఐదు నెలలుకూడా నిండాయి. ఇంకా తండ్రి దగ్గిరా, భార్య దగ్గిరా జడుస్తూ, జంకుతూ బ్రతకవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

వాళ్ళిద్దర్నీ జయించేడా? ఇక లోకాన్ని జయించినట్టే! సాంఘిక జీవితానికి కుటుంబం బలమైన పట్టుకొమ్మ. తాను కుటుంబాన్ని జయించాలనుకున్నాడా, స్వేచ్ఛ కావాలనుకున్నాడా? తనకి కుటుంబం నుంచి స్వేచ్ఛకావాలా - వ్యక్తులనుంచి స్వేచ్ఛకావాలా?

చిదంబరానికి కాలేజీ రోజుల్నించీ వామపక్ష భావాలున్నాయి. పెరిగినకొద్దీ ఆ భావాలుకూడా పెరిగాయి. ప్రగతిశీల సాహిత్యం ముమ్మరంగా చదివేడు. తనకు గల పరిమితుల్లో కొన్ని సభలకు కూడా హాజరయ్యేడు. కులం మీదా మతం మీదా నమ్మకాలు పోయాయి. అర్థమయినకొద్దీ వాటి మీద తిరుగుబాటు చెయ్యవలసిన అవసరం ఎంతవున్నదో తెలిసివచ్చింది. కుటుంబం ఆ దోపిడీ విలువల్నే నిలబెడుతుంది. తను పనిచేస్తున్న ఆఫీసూ అంతే. తను కొందరిపై అజమాయిషీ చేస్తున్నమాట నిజమే. కాని తనపై అజమాయిషీ వున్నది. పై ఆఫీసరుకు తను విధేయుడై వుండాలి. ఈ ఆధిపత్య భావజాలంపై తిరగబడాలన్నది అతని ధ్యేయం.

కాలేజీలో చదువుతున్నప్పుడు, కాలేజీ చదువు చదవని, అసలు చదువేరాని అమ్మాయిని ప్రేమించాడు. మూగప్రేమ. ఒక్కసారికూడా మాట్లాడలేదు. ఆ అమ్మాయి సరేసరి. కాని నవ్వులు చూపులు ఇరుపక్కలా జోరుజోరుగా సరఫరా అయ్యాయి. మూగప్రేమ జంకు, భయం, పిరికితనం - చూస్తూ చూస్తూ వుండగానే ఆ అమ్మాయికి కాస్త వయసు మళ్ళినవాడితో కనీసం పదిపదిహేనేళ్ళయినా, పెద్దవాడుండొచ్చు పెళ్ళయిపోయింది. కాలేజీ చదువు తరవాత, మరో అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమలేఖలు రాశాడు. కలుసుకునేవారు. పెళ్ళి చేసుకోవాలని కలలు కన్నాడు. కులాంతరం. చిదంబరానికుద్యోగం లేదు. ప్రేమ వెనుక ఆర్థిక సమస్యలున్నాయని ఆనాడు తెలీదు. ఇంతలో ఒక ప్రేమలేఖ తండ్రి చేతిలో పడింది. తన గూబ పగిలింది. వీపు చిట్లింది. ఎదిగిన కొడుకును చావబాదాడు తండ్రి. పెద్దవాడిని చూసి చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ పాడవుతారు. వాళ్ళందర్నీ తను దారికి తేగలడా? పెద్దవాడ్ని చితక్కొడితే - చిన్నవాళ్ళు జడుస్తారు. అదీ ఆయన ఆలోచన. వారం రోజులయినా వీపు మంట తగ్గలేదు.

ఆరు నెలలు తిరక్కుండా చిదంబరానికి పెళ్ళయింది. తుని సంబంధం. ఏ కోణంలో చూసినా నచ్చని పిల్లని చేసుకున్నాడు. అసలా ఊరే నచ్చలేదు. పిల్ల నచ్చలేదు గనక ఊరు నచ్చలేదేమో. హైస్కూలు చదువు పూర్తి చెయ్యని పిల్ల. ఎర్రగా తగుమాత్రం పొడవుగా వుంటుంది. తల్లిదండ్రుల మాట జవదాటదు. సినిమాలు పెద్దలతో తప్ప చూడదు. పూజా పునస్కారాలూ, వ్రతాలూ, నోములూ చేస్తుంది. చందమామలూ, సినిమా పత్రికలూ చదవదు. చాలా సాంప్రదాయమైన' పిల్ల.

ఆడవాళ్ళకేకాదు మగవాళ్ళక్కూడా నోట్లో నువ్వుగింజనానదు. చిదంబరం అసలే కడుపులో ఏమాటా దాచుకోలేడు. ఏ సంగతి దాగదు. పెళ్ళయి పదహార్రోజులు దాటకుండా భార్యకి అన్నీ చెప్పాడు. తన ప్రేమకథలు చెప్పాడు. తండ్రి చేతిలో తన్నులు తినడం కూడా చెప్పాడు. నువ్వంటే నాకిష్టం లేకపోయినా పెళ్ళిని తప్పించేస్తే, నీకు ఆ తరవాత పెళ్ళికాదేమోననే భయంతో - చేసుకున్నానని చెప్పాడు. కాలేజీ కబుర్లు చెప్పాడు. చలం పుస్తకాల్లో చదివిన ప్రేమగురించి చెప్పాడు. అబద్ధం చెప్పడం ఆత్మలోకంలో దివాలా అన్నాడు. తాళికట్టిన నేనంటే నీకిష్టం లేకపోతే ఎవర్నయినా ప్రేమించే హక్కు నీకుందన్నాడు. ప్రేమగురించి స్త్రీ స్వేచ్ఛగురించీ, అసలు స్వేచ్ఛ గురించి చాలా చాలా సంగతులు చాలాచాలా ఆవేశంగా చెప్పేడు.

అలా గుడ్లు నిలేసి విన్నది భార్య, చాలా వింతగా చూసింది మొగుడికేసి. ఒక్క క్షణం ఏమీ పాలుపోలేదామెకి. ఆ తరవాత చిదంబరానికి కష్టాలు ప్రారంభమయ్యాయి. అవి ఇప్పటికీ తీరలేదు. ఎప్పటికీ తీరవు భార్య అతన్ని తిరగేసి అర్థం చేసుకుంది. ఒక రకంగా చిదంబరం కూడా, భార్య సాంప్రదాయిక ఆలోచనలకి, అభ్యుదయ భావాలకీ అడ్డుకట్ట వెయ్యాలనుకుని, పొరపాటే చేశాడు.

"చీకట్లో కూర్చున్నారేమిటి?" - అని భార్య వచ్చి లైటు వేసింది. "ఏం లేదు". అన్నాడు.

కూతురూ అల్లుడూ మనవలూ తమవూరికి వెళ్ళారు. చిదంబరం, భార్యా ముసలి తల్లిదండ్రులూ మాత్రం ఇంట్లో వున్నారు. చాల పెద్ద ఇల్లు చాలా లోన్లు తెచ్చి ఇల్లు కట్టాడు. రిటయిర్మెంటు క్షణం వరకూ, బహుశా ఆ తరవాత కూడా, అప్పు తీరుస్తూనే వుండాలి. అంత పెద్ద ఇంట్లో ఇప్పుడు నలుగురే వున్నారు. ఇల్లంతా బోసిగా వుంది.

టీవీ అంతగా ఇష్టం వుండదు. కాని భార్య చాలా ఎక్కువగా పెట్టుకుంటుంది. పెద్ద సౌండు వుంటే గాని చూసినట్టూ విన్నట్టూ వుండదట. తను నిరంతరం టీవీ భరించాలి. తండ్రి, తల్లీ భక్తిపాటలు చూస్తారు. అవీ తనకి నచ్చవు. తనకి నచ్చిన కార్యక్రమాలు తాను మాత్రమే చూసే స్వేచ్ఛలేదు. ఎలాగ? ఇది తన ఇల్లే. కాని తన ఇష్టం చెల్లదు. ఎందుచేత? తనొక విడి వ్యక్తికాదు. కుటుంబంలో భాగం. సంఘంలో భాగం. అంతా ఎలా వుంటే తనూ అలా వుండాలి. సంఘ సంప్రదాయాల్నీ మతాన్నీ, కులాన్నీ దిక్కరించాలంటే కష్టాలుతప్పవు.

చిదంబరం వ్యక్తిగతంగా పూజా పునస్కారాలు మానేసి చాన్నాళ్ళయింది. ఉద్యోగంలో బదిలీల్లో ఉత్తరాంధ్రలో చాల ఊళ్ళు తిరిగాడు. కనుక - తన భార్యతో పదేళ్ళు చాలా పెద్ద యుద్ధం చేసి ఇంట్లోంచి దేవుడి బొమ్మలు తొలగించాడు. భార్యతో పదేళ్ళ భావఘర్షణ - వాగ్యుద్ధం.

తరవాత, తను యజమాని గనుక - ఆ పని సాధించగలిగాడు. దాంతో వాళ్ళిద్దరికీ మానసికంగా కుదరడంలేదు. ఇద్దరూ చేసిన యుద్ధాలముందు ఏ ప్రపంచ యుద్ధాలూ చాలవనిపించింది. కుటుంబయుద్ధాలు, ప్రపంచ యుద్ధాలకంటె తీవ్రమయినవనీ, ఫలితాలు దారుణంగా వుంటాయనీ అనుభవం అయ్యేసరికి అంతా మించిపోయింది. భార్యని వీరనారి అంటుంటాడు. భార్యా భర్తలు రెండు ప్రపంచాలు కదా రెండు వేరువేరు భావజాలాల ప్రతినిధులు కదా. మరి ప్రపంచయుద్ధాలు కాక ఏం జరుగుతాయి? ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడిపోతారు? దేవుడి బొమ్మలు తీసి తాత్కాలికంగా గెలిచాడా? తాత్కాలికంగా ఓడిపోయాడా?

మరి రేడియోని, టీవీని, ఎలా కాదనగలడు. ఆర్థిక సిద్ధాంతాలు, అదనపు విలువదోపిడీ, సామ్రాజ్యవాదం, సరుకులమాయ - అన్నీ చదువుకున్నాడు. దేవుడి బొమ్మలు తీసేశాడు గాని - రేడియోని, టీవీని, టూ-ఇన్-ఒన్‌ని ఏం చేసినా తియ్యలేడు. కనీసం ఒక్క అంగుళం కదల్చలేడు. సరుకుల మాయలో దేవుడున్నాడని కేవలం దేవుడి మీద పోరాటం ఫలించదనీ అర్థమయ్యేసరికి - చాలా ఆశ్చర్యం వేసింది. ఒక అద్భుత సత్యాన్ని, కేవలం చదువుకోవటం ద్వారా మాత్రమే కాక, జీవితానుభవంతో, కుటుంబయుద్ధంతో బోధ పర్చుకోగలిగాడు. ఏం చెయ్యగలడు?

చిదంబరం చాలాకాలం ఉమ్మడిలో ఉన్నాడు. భార్య ఇంటిల్లపాదికీ ఎంత చాకిరీ చేసిందో చేసింది. తమ్ముళ్ళూ, చెల్లెళ్లూ ఆమె చాకిరీతోనే పెరిగారు. తల్లి మొదణ్ణించీ సంతానం కనడంతో నలిగిపోయింది గనక, పెద్దకోడలు మీద ఆధారపడింది. ఓర్పుగా చాకిరీ చెయ్యడంలో తన భార్య భూదేవంత గొప్ప వ్యక్తి. ఉమ్మడి కుటుంబానికి బలి అయిపోయింది. ఉమ్మడిలో ఉండే సమస్త దుర్మార్గాన్నీ ఇద్దరూ మౌనంగా భరించారు. ఆ బాధల, ఆ గాధల ఆనవాళ్లు ఇద్దరిగుండెల్లో నిత్యం పచ్చిగా కదుల్తుంటాయి. ఆరోజులు కళ్ళల్లో మెదిలి, కళ్ళు నీళ్ళతో ఎర్రబడ్డాయి.

భోజనం చేస్తున్నాడు. తనకి ఫలానాకూర ఫలానాలాగ చేస్తేనే యిష్టం. కాని ఆమె అలా చెయ్యదు. తనకి కావలసిన రకంగా చేస్తుంది.

"అంతా మీ యిష్టమేనా? ఇదేనా మీరు చెప్పే ఆదర్శం? స్త్రీ స్వాతంత్ర్యం? కూరవండే స్వాతంత్రం కూడా నాకు లేదా?" అని లేచింది. ఏం చెబుతాడు? భోజనం చేస్తున్నాడు.

భార్యని తనవేపు మార్చుకోగలననుకున్నాడు. గురజాడ, చలం, శ్రీశ్రీ, గోపీచంద్, కుటుంబరావు, రంగనాయకమ్మ, వట్టికోట ఆళ్వారుస్వామి, ఇటీవల ఇటీవల ఓల్గా, ఛాయాదేవి, రజని. ఇలా చాలా చాలా పుస్తకాలు చదవమని ఇచ్చాడు. అందులో వున్న సంగతులన్నీ చెప్పాడు. నా కలాంటి సంగతులు సరిపడవు. నాకు చెప్పొద్దు. వినేవాళ్ళకి చెప్పుకోండి' అన్నది. మొగుడు తెచ్చాడంటే ఆ పుస్తకం అస్సలు చదవదు. మంచి సినీమా అని చెప్పాడంటే తిట్టి పోస్తుంది ఆ సినిమాని. మంచి సినిమాలు అట్టే లేనిమాట నిజమే.

ఇరుగు పొరుగుల్నించి, స్వాతి, సినీమా పత్రికలు తెచ్చి చదువుతుంది. ఇంటికి వచ్చే దినపత్రికలో సీరియల్స్, సినీమా, వారఫలాలు, క్రైమ్‌స్టోరి - ఇప్పటికీ చదువుతుంది. ఆదర్శాలూ సిద్ధాంతాలూ అంటే ఆవిడకి వళ్ళుమంట. పత్రికల్లో, టీవీసీరియల్స్‌లో ఆదర్శాల డైలాగులు మాత్రం చెవులు వొప్పగించి వింటుంది మళ్ళీ. ఆమె దృష్టిలో చిదంబరం చెడిపోయిన మనిషి లేకపోతే ఆ స్వేచ్ఛాప్రేమ సిద్ధాంతాలు, వామపక్ష భావాలు ఏమిటి? దేవుడు లేకపోవడం ఏమిటి? కులం లేకపోవడమేమిటి? టీవీ చూడొద్దనడం ఏమిటి? టీవీ సరుకుల మాయట! సరుకుల మాయే దేవుడిమాయట! భక్తిభావం దోపిడీని సులభతరం చేస్తుందట! ఏమి మాటలు - తలనొప్పి! ఇదీ అతనిగురించి ఆమె ఉద్దేశం.

ఉమ్మడి కుటుంబంలో గొడవలు తల్చుకుంటే వెన్నులోంచి వణుకొస్తుంది. తను సంప్రదాయ వ్యతిరేకి. భార్య సంప్రదాయ భావాలు కలది. తనిని అంతా తిట్టేవాళ్ళే. ఆమె చేసిన తప్పుల్ని - అవి ఎంత ఘోరాలయినా - తన తల్లితండ్రులతో సహా ఎవరూ పట్టించుకోలేదు. బహుశా సంప్రదాయాన్ని నమ్మేవాళ్ళ తప్పుల్ని లోకం క్షమిస్తుంది.

ఘోరనేరాలు చేసిన గుణనిధికీ, నిగమశర్మకీ - దేవతలు క్షమించి మోక్షం ఇవ్వలేదూ? ఎంత గొప్పవాడయినా బలిచక్రవర్తిని పాతాళానికి అణచలేదూ? బహుశా ఇప్పుడూ అంతేనేమో. కోట్లాది రూపాయల ఇన్‌కంటాక్స్ కట్టని వాళ్ళ పేర్లన్నీ పేపర్లలో పెద్దక్షరాల్తో పడ్డాయి. కేంద్రరాష్ట్ర మంత్రులు, సినీనటులు, పారిశ్రామికవేత్తలు. వాళ్ళనెవరు ఏం చెయ్యగలిగారు? రాజకీయనేరస్తుల్ని ఎవరు ఏం చేయగలిగారు? నువ్వు పాలక పక్షానికి చెందితేచాలు నీకేం జరగదు. ఒక వేళ ఏదన్నా జరిగితే విపరీత ప్రచారం - తిరిగి ఉపసంహరణ. నువ్వు మొత్తంగా పాలకవర్గానికి వ్యతిరేకివా? - లాకప్ డెత్, ఎన్‌కౌంటర్,

కారుప్రమాదం, విమానప్రమాదం నాటికీ నేటికీ ఇదే వరుస. చిదంబరం బుర్రంతా పిచ్చిపిచ్చిగా వుంది.

వంటగది చక్కబెట్టుకుని వచ్చిన భార్య, పడుకుని టీవీ చూస్తోంది. ఆమెకి సీరియల్స్ పిచ్చి, ఇరుగుపొరుగు అమ్మలక్కలందరికీ అదే పిచ్చి, మగవాళ్ళకి క్రికెట్ పిచ్చిలాగ. పేకాటపిచ్చీ, సిగరెట్ పిచ్చీ, తాగుడు పిచ్చీలాగ. చిదంబరానికి క్రికెట్ గురించీ, మరి ఏ ఇతర స్పోర్ట్సుగురించి గాని బొత్తిగా తెలీదు. ఒకటి రెండుసార్లు టీవికి ఆ సీరియల్స్ కూడా చూడబోయాడు. తలకాయున్నవాళ్లెవరూ ఆ సంఘటనలూ, సంభాషణలూ భరించలేరు. తలలేని వాళ్ళని భారీసంఖ్యలో తయారుచెయ్యడమే కదా టీవీ లక్ష్యం!

లేచి, తనగదిలోకి వెళ్ళి, ముఖ్యమైన కాయితాలు చూసుకోనారంభించాడు. విసుగు పుట్టింది. ఏం మనుషులు! లంచం తీసుకునేవాళ్ళు మంచివాళ్ళు! తీసుకోకుండా నిక్కచ్చిగా రూల్సు ప్రకారం పనిచేసేవాళ్ళు. ప్చ్. లాభం లేదు. తనకి అధికారం వుంది. కాని ఏం చెయ్యలేడు. ఈ ఉద్యోగం అసహ్యంగా వుంది...చిన్న ఉద్యోగంలో చేరాడు, ముప్ఫయిరెండు సంవత్సరాలక్రితం వందరూపాయలు జీతంతో ఎన్నో అంకెలు దాటాడు. ఎన్నెన్నో పరీక్షలు పాసయ్యాడు. ప్రమోషన్ల మీద ప్రమోషన్లు. ఇవ్వాళ పద్దెనిమిది వేల జీతం. కాని బోలెడు టాక్సు కట్టాలి. డబ్బు ఇంత భయంకరంగా విలువకోల్పోతుందని ఎన్నడన్నా అనుకున్నాడా?

పక్కమీద అటు యిటూ దొర్లుతున్నాడు. ఎప్పుడు నిద్రపట్టిందో.. మెలకువ వచ్చేసరికి తండ్రి అతి చిన్న స్వరంతో భగవద్గీత చదవడం వినిపించింది. అంటే ఐదు దాటిందన్నమాట. పక్కమంచం మీద భార్యలేదు. తండ్రికి చీకట్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని దంత ధావనం చేసుకుని రోజూ భగవద్గీతలో ఒక అధ్యాయం చదవడం అలవాటు. ఆ కార్యక్రమంలో మార్పులేదు. చిన్నప్పుడు - హైస్కూలు, కాలేజీ రోజుల్లో తనూ భగవద్గీత చదివాడు, తండ్రి ప్రభావం వల్ల. కాని త్వరలోనే ఆపేసాడు. పెళ్ళయ్యాక కొద్దినెలల తరవాత జంజెంకూడా తీసేశాడు. ఆ జంజెం మీద తండ్రికీ కొడుక్కీ చాలా యుద్ధమే జరిగింది. చిదంబరం గెలిచాడు.

☆☆☆

చిదంబరానికి ఇద్దరు కూతుళ్ళు. బాగా చదివించాడు. డిగ్రీలు చేశారు కూతుళ్ళిద్దర్నీ చిన్నప్పట్నించీ ఒళ్ళో కూచోబెట్టుకుని అభ్యుదయ భావాలు నూరిపోసేడు. వాళ్ళే తన భావజాలానికి నిజమైన వారసులనుకున్నాడు. వాళ్ళు తన పక్షం కనుకనే ఇంట్లోంచి దేవుడి పటాలు సులభంగా తీసెయ్యగలిగాడు. ఇద్దరిచేత గురజాడ, చలం, శ్రీశ్రీ, రంగనాయకమ్మల పుస్తకాలతోపాటు, అరుణతార, స్వేచ్ఛ మొదలైన పత్రికలు చదివించాడు. వామపక్ష ప్రగతిశీల భావజాలం బోధించాడు. పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించారు. సరిగ్గా ఆ సమయంలోనే - ఇందిరమ్మ మరణం తర్వాత రెండుమూడేళ్ళలో - చాలా యిళ్ళల్లో టీవీలు వెలిశాయి. భారతం, రామాయణం, టిప్పు సుల్తాన్ మొదలైన సీరియల్స్ ఇంటందర్నీ ఏ పనులూ చేసుకోనివ్వకుండా వినోదం ఇవ్వడం మొదలైంది. క్రికెట్ వినడం పోయి చూడటం ప్రారంభమయింది. కాస్త మంచి అల్లుళ్ళనే చూసి పెళ్ళి చేశాడు. ఆదర్శాలవల్ల, క్లుప్తంగా కూడా చేశాడు - లేదా చేశాననుకున్నాడు. ఇద్దరల్లుళ్ళూ మత ఛాందసాలకు దూరంగా ఉన్నందుకు సంతోషించాడు. కాని త్వరలోనే వాళ్ళు - తను ఆశించినపాటి అభ్యుదయవాదులుకూడా కాదని తెలిసిపోయింది. చాలా సమస్యలు సామాజిక కుటుంబసమస్యలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడివున్నాయని తెలిసిపోయింది. తను చేసినవి ఆదర్శవివాహాలు కాదనీ, సామాజిక ఆచరణ ఆవగింజంత కూడా వుందని మధ్యతరగతి

కుటుంబాల్లో, ఊగిసలాట ఊహజీవుల్లో - ఆదర్శవివాహాలు పరమ అబద్ధం అనీ బోధపడింది.

చిదంబరం మనసు ఎంత ఆక్రోశిస్తున్నదో! తాను ఏ పరిధుల్లో పెరిగాడో ఏ స్థాయికి ఎదగాలని ఆశించాడో గుర్తొచ్చింది. తనలోని లోపాలుకూడా బాగా ఆలోచించుకున్నాడు. కాని.. కాని.. తన తరువాత తరం, తనసంతానం ఆ లోపాల్ని అధిగమించాలనుకున్నాడు. కాని.. ఏటికి ఎదురీదడం ఎంత కష్టం. ఇప్పుడిక పూర్తిగా తెలిసిపోయింది. స్వేచ్ఛవేరు. స్వతంత్రం వేరు.

తానుకోరుకున్నది బహుశ స్వేచ్ఛ స్వ ఇచ్ఛ ఇది జరగదు. కాని స్వతంత్రం? అదీ కుదరలేదు. వ్యక్తులు ఏం చేయ్యలేరు. బలమైన సామూహిక శక్తిగా తప్ప, ఈ సంఘాన్ని ఒక్క అంగుళం కూడా కదల్చలేం.

తీరదు. తనకోరిక తీరదు. ఇది వ్యక్తిగత అసమర్ధత కాదు. తన ఇష్టాయిష్టాలు, తన ఇష్టాయిష్టాలు కావు. సంఘంలో రావాలని అందరూ ఆశించేమార్పులే.

చిదంబరం మనసంతా కందిరీగల పుట్టలావుంది. మెదడు కుతకుత ఉడుకుతున్నట్టుంది. శరీరం మొత్తం ఒక రైలింజన్‌లా. వేడిగా మోత మోగుతోంది. కరంటు పోయింది. పవర్‌కట్.. దోమలు గుయ్యిమని దాడి ప్రారంభించాయి.

తనుకోరుకుంటున్నది తనకి కావలసినరకంగా వుండాలని కాదు. తను కోరుకుంటున్నది తన స్వతంత్రం కాదు. దేనుళ్ళూ దయ్యాలూ బాబాలూ అమ్మలూ చేతబళ్ళూ బల్లిశాస్త్రం పిల్లిశాస్త్రం, వాస్తు శాస్త్రం, జ్యోతిశాస్త్రం, పుట్టుమచ్చల శాస్త్రం, తాపీదులు కట్టబడును, స్వస్తత ప్రార్దనలు. వగైరా వగైరాలు లేని సంఘం. సరుకుల వ్యామోహం, ధనవ్యామోహం, స్వంత ఆస్తి భావం, ఆధిపత్యం, దోపిడీ, ఆర్ధిక అసమానత - లేని సంఘం. స్త్రీ బాల వృద్ధులకు, భద్రతా భావం వుండే సంఘం - అదీ కోరుకుంటున్నాడు.

ఇన్నాళ్ళ పోరాటం తరవాత, ఆరాటం తరవాత, కొంచెం తెలిసినట్టయింది. అన్ని రాష్ట్రాల్లో వివిధపేర్లలో యువకులు పోరాటం చేస్తున్నారు. కాదు - అన్ని దేశాల్లో ఈ పోరాటం జరుగుతూనే వున్నది. ఆ సాయుధపోరాటాలకీ, కుటుంబాల్లో పోరాటాలకీ పోలికలున్నట్టున్నాయి. కుటుంబం రాజ్యానికి మినీరూపం. రెంటికీ పోలికలున్నదీ, ప్రాధాన్యం వున్నదీ బహుశా అందుకే. ఎందరు ఆడవాళ్ళు తమ కుటుంబాల్లో పోరాటం చెయ్యడం లేదు! పోరాటం లేనిదే విముక్తిలేదు. పోరాటం ఎక్కడైనా పోరాటమే. కొన్ని కుటుంబాల్లో ఎన్‌కౌంటర్లు - భౌతిక హత్యలూ, ఆత్మహత్యలూ జరుగుతున్నాయి. త్యాగాలు కూడా నిరర్ధకమౌతున్నాయి.

చిదంబరానికి తన జీవితక్రమం, ఆలోచనలక్రమం అర్ధమైంది. తనిప్పుడు పోరాటంలోనే వున్నాడు. పోరాటానికి వెనుదీస్తే విముక్తి వెనుదిరిగి పోతుంది. ఇది ఆడవారికీ, నిజమే. మొగవారికీ, నిజమే.

కరెంట్ వచ్చింది. చాలాసేపటి చీకటీ, దోమల మోతా, తరవాత వెలుతురు నిండింది. ప్రతివస్తువూ, పాత చీకటిరూపం పోగొట్టుకుని, స్పష్టంగా కనిపించి - చిదంబరానికి ఆనందం కలిగింది.

రచనా కాలం: అక్టోబరు 200
వార్త - అటా కథపోటీలో ప్రచురణకు ఎంపికయింది.
ప్రచురణ : అమెరికా వాణి - మార్చి/ఏప్రిల్ 2002

కథ నిలయం 50.55 శ్రీకాకుళం